# తీసుకోని నిర్ణయాలు

చెఱువు గట్టుమీది కొచ్చేసరికీ నా నడక ఆగింది. తూర్పు వైపు దేవాలయం, దాని ప్రక్కగా పెద్దమర్రి – అలాగే నిలబడివున్నై.

నేను ఆగినచోట వుండాల్సిన జువ్విచెట్టు, దాని ముందు నేరేడు చెట్లు లేవు. ఆ జువ్వి చెట్టుకు తాటిబద్దల ఉయ్యాల వుండేది. అట్లతద్దె, ఉండ్రాళ్ళ తద్దె వంటి పండుగరోజుల్లో ఆ ఉయ్యాల ఎంతో ఉత్సాహంగా ఆకాశాన్నంటుకుంటూ వుండేది. మామూలు రోజుల్లో దానిమీద గాలి మాత్రమే ఊగుతూ వుండేది. జువ్విచెట్టు ఉయ్యాల్లో కూర్చుని అల్లంత దూరాన వున్న నేరేడుకొమ్మని అందుకు రావడం – ఆ రోజుల్లో కుర్రకారుకి పందెంగా వుండేది. పండగ రోజుల్లో ఈ పందెంలోకి ఊరి ఆడపడుచులు దిగేవారు. జతకత్తెలంతా తమలో తాము గిల్లికజ్జాలు పెట్టుకుని ఉడుక్కుంటూ వుంటే చూడ ముచ్చటగా వుండేది. వాళ్ళల్లో వరసలెట్టుకుని పిలుచుకునేవాళ్ళు— పందెంలో వోడిపోగానే క్షణంలో సంబంధాలు తెంచేసుకోవడం చూస్తుంటే సరదాగా వుండేది. 'మీ యనోళ్ళ తుమ్మమొద్దు మా పిల్ల కేం అక్కర్లే' అని వో పిల్ల గేలిచేస్తే – 'ఈ మెల్లకంటికి ఎంత మాత్రపు నవమన్మథుడిని తెస్తారో మేమూ చూస్తాంగా' అని ఎదుటి వాళ్ళు ఎద్దేవా చేసేవాళ్ళు. అంతలోనే ఇద్దరూ చెమ్మచెక్కలాటకి

తయారయ్యేవాళ్లం. ముచ్చటగా వుండేవి – ఆ మాటలూ, ఆ తగాదాలూను.

కార్తీ వెళ్లి కార్తీ వస్తూ వుంటే – సంబరాలలో వైవిధ్యం, దిన చర్యలోనూ వైవిధ్యం కనబడేవి. తెల్లవారుఝామునే చెఱువులో ఈతకు తయారయ్యేవాళ్లం నేనూ దాసూ. ఓ రెండుగంటలు శరీరానికి వ్యాయామం. చద్దన్నాలు అయ్యాక నేరేడు పళ్లు ఏరుకు రావడానికో, ఈత గెలలు కొట్టుకు రావడానికో, తాటిగెలలు దించడానికో డొంకన పడేవాళ్లం. సాయంకాలాల్లో చెడుగుడు లేదంటే డొంకన బిళ్లం గోడు ఆటలు. వచ్చేటప్పుడు దూడకి నాలుగు లేతపరకలు తేవడం నా పని. దారిలో మాతోట వో మజిలీ. అక్కడ సీమచింతకాయలో, సపోటా పళ్లో, మామిడిపిండెలో, చింత చిగురో దొరికేది. తోటలో ఓ మూలగా గోరింట చెట్టొకటి వంగిపోయి పడక్కుర్చీలా సాచుకుని వుండేది. దానిమీద పడుకుని లయబద్ధంగా చెట్టుని ఊపుతూ పుష్ప విలాపం రాగాలు తీసేవాణ్ణి. ఆకాశంకేసి చూస్తుంటే – మునిమాపులో చందమామ కన్నుగీటేవాడు; పిట్టలు గిరికీలు కొడుతూ కవాతు చేస్తుం డేవి. మబ్బులు క్షణానికో ఆకారాన్నిచూపి విచిత్రమైన చిత్రాల్ని కల్పిస్తూ వుండేవి.

"ఏదో భావావేశానికి లోనైనట్లున్నావ్'' – దాసు పలకరిం చాడు. అప్పటివరకూ అతను నావక్కనే వున్నాడన్న స్పృహ కోల్పో యాను. "మన చిన్నతనం గుర్తుకొచ్చింది'' అన్నాను. అతను ఫక్కున నవ్వాడు, ''ఆరోజులు తలచుకుని, ఈ మార్పుల్ని చూస్తుంటే నిజంగా మన చిన్నతనం గుర్తుకొస్తుంది" అన్నాడు – 'చిన్నతనం'– మాటని నొక్కి పలుకుతూ. నాకూ నవ్వొచ్చింది.

''ఈ చెఱువుని మీ ముత్తాత తవ్వించాడట. మీ నాయనమ్మ

చెప్తూవుండేది" యాథాలాపంగా అన్నాడు.

కళ్లు విప్పుకుని నలువైపులా చూశాను. ఎంత పెద్ద చెఱువు. తూర్పున దేవాలయం, దక్షిణాన గట్టుదిగువగా పొలాలు; ఉత్తరపు వైపున ఊరికి పెద్దబజారు, పడమర మేం నిలబడిన మేర — ఇప్పుడు పంచాయితీకార్యాలయం, పిల్లల పార్కు వెలిసినై. మట్టి రోడ్లు కంకరరోడ్లుగా మారినై.

ఇద్దరమూ నడవటం మొదలెట్టాము.

మనసు పొరల్లో దాచుకున్న జ్ఞాపకాలన్నీ రంగు రంగుల గాలి పటాలై పైకి లేస్తున్నై.

ఏడో తరగతి చదువుతున్నప్పుడు — దాసుతో కలిసి నేను పడవల కాలవల్లో ఈతకొట్టటానికి వెళ్తున్నానన్న సంగతి ఇంట్లో తెలిసిందో రోజు. నాన్న కళ్లెర్రచేసి రూళ్ల కర్ర తీసుకున్నాడు. గుప్పిట మూయమని మెటికల మీద రూళ్ళ కర్రతో కొట్టేడు. "ఈ స్నేహాలు మానేయ్. వాడితో పూసుకు తిరుగుతున్నట్టు నాకు తెలిసిందో డొక్క చీరేస్తాను" — ఇదీ హెచ్చరిక !

అమ్మ మరో అడుగు ముందుకువేసి, "ఆ కిరస్తానీవాడు నిన్ను నిలువునా నీళ్లల్లో ముంచేస్తాడు. ఎక్కడ తేలతావో కూడా తెలీదు" అంది.

నాయనమ్మ ఆరాత్రి నుంచీ నన్ను తన దగ్గర పడుకోవద్దంది. నా గుడ్డలు ముందుగదిలో విడిచి లోపలకి వస్తూ వుండాల్సిందేనని ఆంక్ష పెట్టింది.

చింతలతోపు దగ్గరికొచ్చాం. దాసు అన్నాడు, "ఈ కనిపించే పొలాలన్నీ మీవేగా అప్పట్లో ...."

గుండెల్లో ముల్లు గుచ్చుకొన్నట్లయింది నాకు. ఎదురుగా

చూశాను. ముప్ఫై ఎకరాల పల్లపు భూమి. తాతయ్య సప్తాహాల లోని నేతి డబ్బాలకూ, మా ముగ్గురు అత్తల పెళ్ళిళ్లలో విందు భోజనాలకూ, మా నాన్న అపరాల వ్యాపారంలో లోటుపాట్లకూ — చెల్లిపోయిన సంపద అదంతా. వాళ్ల అహమూ, ఆడంబరమూ చాపక్రింది నీళ్లలా ప్రవహిస్తే — నేనూ, అమ్మా, ఇద్దరు తమ్ముళ్లూ, ఇద్దరు చెల్లెళ్లూ — ఆ తర్వాత — కడుపులో కాళ్లెట్టి కాలాన్ని త్రోయాల్సిన పరిస్థితికి లోనైనాము.

నా మనసులో మెదులుతున్న భావాల్ని గమనించి నట్లున్నాడు దాసు. "ముందుకు నడిచిన కొద్దీ — అప్పట్లో మీ నిమ్మతోట నిన్ను నిలవేస్తుంది. మెరకచేను తిరిగి మీ యింటికి పోవద్దంటుంది. పద వెనక్కి తిరుగుదాం" అన్నాడు. ముఖాన చెళ్లున చల్లిన వాస్తవాలు ఇవన్నీ. నేనేమీ బాధపడలేదు.

కాలు సాగింది. ఊరి వైపునుంచీ వచ్చిన బళ్ల బాటమీదికి మళ్లేము.

నెలవెలుగు పరచుకుంటోంది. దూరంగా వివరంలేని సవ్వళ్లు వినవస్తున్నై. ఓ మూలనుంచీ పశువులకు పెట్టిన కుమ్మ పొగ క్రమ్ముకుంటోంది.

"ఆ రోజులు వేరు. మంచికైనా చెడుకైనా ఒకేవిధమైన ఆర్భాటం చేసేవాళ్లు. నీకు గుర్తుందా — నువ్వూ నేనూ ఎస్సెల్సీ ప్యాసైన రోజు."

దాసు కేసి చూశాను. తుమ్మ చెట్లకున్న గడ్డి సంచుల్లాంటి పిచ్చిక గూళ్లని చేత్తో తడుముతూ నడుస్తున్నాడు. ఆ రోజు జరిగిన గొడవంతా నా కళ్లముందు మెదిలింది.

ఆరోజు నేను దాసు వాళ్లింట్లో భోజనంచేసి వచ్చాను. పక్కింటి

వాళ్లూ మా యింట్లో వాళ్లూ అంతా కలిసి "వీడు భ్రష్టుడై పోతున్నా డని గొంతులు చించుకున్నారు. నాయనమ్మ అమ్మకు చెప్పింది, "వాడు ముట్టుకున్న పళ్లేలూ అవీ నిప్పులు పోసి శుభ్రం చేయవే" అంటూ.

కానీ, ఇవేవీ నాకూ దాసుకూ మధ్య పెరిగిన సాన్నిహిత్యాన్ని కుంచింపజేయలేక పోయాయి. మిత్రులంతా మమ్మల్ని 'QU' అని పిలుస్తూ వుండేవాళ్లు. నిజానికి నేను ఆదివారాల్లో దాసుతో కలిసి చర్చికి పోతూవుండేవాణ్ణి. దాసు వినాయక చవితికి గణపతి పూజ చేసేవాడు.

నాన్న పోయారు. పరామర్శ చేసేవాళ్లందరూ "మీ నాన్న గారు పోయారు, బాధ్యతలు నెత్తినపడ్డై. ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లూ నువ్వే గట్టెక్కించాలి. జాగ్రత్త." అంటూ ఓ పెద్దరికాన్ని అపాదించే వాళ్లు. అంతా చుట్టాలేగానీ, ఆవకాయంత సహాయం మాత్రం అందేదిగాదు.

గుండెల్లో ఏదో డిగులుగా వుండేది నాకు. ఆ దిగులునుంచీ, ఆ ఆలోచనల్నుంచీ పారిపోయి దాసు సాన్నిహిత్యంలో గడిపేవాణ్ణి. ఏవేవో పథకాలూ ప్రణాళికలూ వేయడంలో రాత్రుళ్లు గడచిపోతూ వుండేవి.

చివరికి — మిగిలిన కొంచెం కాస్తా అమ్మేసి, రెక్కలమ్ముకోవ డానికి పట్నం చేరేను నేను. దాసు ట్రైనింగ్ అయి వచ్చి టీచర్‌గా స్థిరపడిపోయాడు.

మలుపు తిరిగి బ్రాహ్మణ వీధిలోకొచ్చేము. వీధిలో కరెంటు దీపాలు వెలిగినై. ఊళ్లో కొట్టొచ్చినట్టు కనపడుతున్న మార్పు — ఈ వీధిలో మరీ వివరంగా సాక్షాత్కరిస్తోంది. బట్టల దుకాణాలూ, ఫ్యాన్సీషాపులూ — పట్నంలో షోరూములకేమీ తీసిపోనట్టు వెలిసినై.

ఆనాటి — అగ్రహారీకులంతా పట్నాలు పట్టిపోయినట్టున్నారు. ఒక్కరూ తెలిసిన మొహం కనపడటంలేదు.

"మీ ఇంటి దగ్గరికొచ్చాం" అన్నాడు దాసు — చాలా యాథాలాపంగా. ఇద్దరమూ నిలబడి పోయాం — అప్రయత్నంగా.

అవును మా యిల్లు అది!

మేము ఊరు వదిలి వెళ్ళిపోయేటప్పుడు దాన్ని అమ్మకానికి పెట్టింది మా అమ్మ. కానీ, మా వూళ్ళో వాళ్ళకెవరికీ ఆ లోగిలితో పనిలేకపోయింది. అందులోనూ, అప్పటికే అది బీటలు వారింది — మా బతుకులాగానే. ప్రహరీగోడ పడిపోయి అక్కడంతా పిచ్చి మొక్కలు కంచెలా వ్యాపించాయి. వసారాగోడల్లో సున్నం చవుడు బట్టి ఇటుకలు వూడివస్తున్నై. బంగాళాపెంకులు రాలిపోతున్నాయ్— ఓ వైపునుండి. మా పెదనాయనగారికి చెప్పచెప్పి వెళ్ళిపోయాం. ఆయనా దాన్ని గురించి పట్టించుకోలేదు. ఎప్పుడో ఓ సారి దాసు తన ఉత్తరంలో రాసేడు, "కోతల కొచ్చిన కూలీలూ, పిల్లలూ, కుక్కలూ ఆయింట్లో కాపురముంటున్నై" అంటూ. నేను నవ్వుకున్నాను. ఆరోజుల్లో అది పెద్దలోగిలి. ఎప్పుడూ పెళ్ళిపందిరిలా కళకళలాడుతూ వుండేది. సమారాధనలూ, సంతర్పణలూ, సప్తాహాలూ జరుగుతూ వుండేవి. వాటన్నిటికీ మధ్య పచ్చితాటాకుల పరిమళంలా ఏడాదికోసారి సావిత్రిగౌరిదేవీ వ్రతం వచ్చేది. వారంరోజులో ఏమో-రోజూ ఎంతోమంది ముత్తైదువుల కోలాహలం. పూచిన తంగేడులాంటి నడి వయస్సు వాళ్ళూ, విరిసిన గులాబీల్లాంటి పడుచుపిల్లలూ-చేతుల్లో పళ్ళేలతో, పూజా సామాగ్రితో — పట్టుచీరెల రెపరెపల్లో సొగసులు క్రుమ్మరిస్తూ తిరుగుతూండేవాళ్ళు. ఆయింట్లో ఎల్లప్పుడూ ఆరు ఋతువులూ ఒకేసారి పరిమళించి పోతూవుండేవి.

ఇవ్వాళ ఇల్లు నిప్పచ్చరంగా వుంది. మూర్ఛరోగి మొహంలా వెలాతెలా పోతోంది. బంగారు హారంలా వెలిగిపోతున్న ఆ వీధిలో— నీరు దిగిన రాయిలా వుంది. దాన్లో కాపరముంటున్న మనుషులు— దున్నపోతుల బండికి వెనగ్గా కట్టి లాక్కుపోతున్న దూడల్లా వున్నారు; టిక్కెట్టులేని ప్రయాణీకుల్లా ముడుచుకూర్చున్నారు.

నా కళ్ళను నీటిపొర అడ్డుకుంది.

రుమాలుతో కళ్ళు తుడుచుకొని అడుగు కదిపేను.

"ఇంటిని ఈ స్థితిలో చూస్తుంటే విచారంగా వుంది కదూ?" అడిగేడు దాసు.

కంచు మరచెంబును తేలు కుట్టినట్టయింది.

మ్లానంగా నవ్వి, అతని కళ్ళల్లోకి చూసేను.

"పదహారేళ్ళ తర్వాత పల్లెకొచ్చి చాలా తృప్తితో వెళ్తున్నాను దాసూ, నిజం. పదిమంది అభాగ్యులు తలదాచుకోవడానికి ఈ యిల్లు గూడుగా ఉపయోగపడుతోంది. అదే సంతోషం."

* * *

మర్నాడు,

పట్నానికొచ్చేశాను —

ఆఫీసు నుంచీ రాగానే చెప్పింది మా శ్రీమతి - "ఇల్లు బాగు చేయించుకుని రెండో అంతస్థు వేయించుకుంటారట — ఖాళీ చెయ్యమన్నారు — ఇంటివాళ్ళు" అని.

రేపు

నేను వేరే యిల్లు చూసుకోవాలి!!!